అనుదినం జనపక్షం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
మంగళవారం 04 ఏప్రిల్ 2023

మహనీయుల జయంతి వేడుకలను విజయవంతం చేయాలి : కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

మహనీయుల జయంతి వేడుకలకు అన్ని వర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్లో సోమవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ నెలలో జరిగే జగ్జీవన్ రావ్, అంబేద్కర్, జ్యోతిరావు పూలే జయంతి వేడుకలకు పార్టీలకతీతంగా అన్ని వర్గాల ప్రజలు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల అధికారులు, ఆయా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏఎన్ఎం పోస్టుకు 67 మంది ఎంపిక

6న అభ్యర్థుల సర్టిఫికేట్‌ల వెరిఫికేషన్.. వెబ్‌సైట్‌లో మెరిట్‌లిస్ట్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఏఎన్ఎం/ఎంపీహెచ్ఏ (మహిళల) పోస్టులకు 67 మంది మెరిట్ ఆధారంగా ఎంపిక చేసినట్టు డీఎంహెచ్‌వో సుదర్శనం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మెరిట్ లిస్ట్‌ను nizamabad.telangana.gov.in వెబ్‌సైట్‌లో ప్రదర్శించినట్టు తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల ఓరిజినల్ ధ్రువపత్రాల వెరిఫికేషన్ ఈ నెల 6వ తేదీనా ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నామని, అదే రోజు సాయంత్రం 4 గంటల వరకు తమ పోస్టింగ్ ప్లేస్ కోసం ఆప్షన్‌లు పెట్టుకోవచ్చని తెలిపారు.

తొలి రోజు ప్రశాంతం

- పదోతరగతి పరీక్షలు ప్రారంభం
- కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, డీఈవో

నవతెలంగాణ-కంఠేశ్వర్/నిజామాబాద్‌సిటీ

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం ప్రారంభమైయ్యాయి. కాగా తొలి రోజు ప్రశాంతంగా ముగిసాయి. 9.30 గంటలకు పరీక్షలు ప్రారంభమవ్వగా.. అంతకముందే విద్యార్థులు కేంద్రాలను చేరుకొని తమ హాల్‌టికెట్‌ల నెంబర్‌లకు కేటాయించిన గదులను చూసుకున్నారు. పరీక్ష ప్రారంభమై 5 నిమిషాలు ఆలస్యమైనా విద్యార్థులను పరీక్ష రాసేందుకు అనుమతించారు. చివరి నిమిషంలో వచ్చిన పలువురు విద్యార్థులు ఉరుకులు, పరుగుల మీద సెంటర్‌లకు చేరుకున్నారు.



కేంద్రాల్లో హాల్‌టికెట్ నెంబర్ వారీగా వివరాలు చూస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు.. ఉరుకులు, పరుగులు.. తనిఖీలు

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 138 కేంద్రాల్లో మొత్తం 21,773 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా.. 21,703 మంది హాజరు కాగా 66 మంది గైర్హాజరైనట్టు డీఈవో దుర్గాప్రసాద్ తెలిపారు. కాగా 9 కేంద్రాలను డీఈవో తనిఖీ చేయగా.. ఫ్లయింగ్ స్క్వాడ్స్ 48 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్

తనిఖీ చేసిన కలెక్టర్

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు పలు పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. జిల్లా కేంద్రంలోని రవి హైస్కూల్ లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. పరీక్షల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరు, సిబ్బంది హాజరుపై ఆరా తీశారు. నిబంధనలకు అనుగుణంగానే నిర్ణీత సమయంలో ప్రశ్న పత్రాలను తెరిచారా? స్ట్రాంగ్ రూం ల నుండి ఎన్ని గంటలకు ప్రశ్న పత్రాలు కేంద్రానికి చేరుకున్నాయి, ఆ సమయంలో పోలీస్ ఎస్కార్ట్ ఉందా? తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి వసతి అందుబాటులో ఉందా? లేదా? అని గమనించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సజావుగా పరీక్షలు జరిపించాలని చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటల్ అధికారులకు సూచించారు. ఎక్కడ కూడా కాపీయింగ్ కు ఆస్కారం ఉండకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, కాపీయింగ్‌కు పాల్పడితే మాల్ ప్రాక్టీస్ కేసులు బుక్ చేయాలని నిర్వాహకులను కలెక్టర్ ఆదేశించారు. పరీక్షలు ముగిసేంత వరకు కూడా ఎంతో అప్రమత్తతతో పకడ్బందీగా విధులు నిర్వహించాలని సూచించారు. ఎలాంటి తప్పిదాలకు అవకాశం ఇవ్వకుండా పక్కాగా పరీక్షలు జరిపించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ఎండీ.ఫజలుల్లాహ్ తదితరులు ఉన్నారు.

అనుమతి లేదు..

ఇన్విజిలెటర్లకు సెల్‌ఫోన్‌లు అనుమతి లేదని.. ఎవరైనా తీసుకొస్తే వారిని సస్పెండ్ చేస్తామని డీఈవో తెలిపారు.

మిట్టమధ్యాహ్నం తరగతులు

- పది పరీక్షలున్న కేంద్రాల్లో మధ్యాహ్న నుంచి తరగతులు
- మండుటెండలతో విద్యార్థులకు ఇక్కట్లు

నవతెలంగాణ-రామారెడ్డి



రామారెడ్డి మండలంలో ఉక్కపోతకు చెట్ల కిందే తరగతులు

పదో తరగతి పరీక్షా కేంద్రాలు ఉన్న స్కూళ్లల్లో 1-9వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 1 గంట నుంచి తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో మండుటెండలో విద్యార్థులు స్కూల్‌కు రావాల్సి వస్తుంది. ఇప్పటికే భానుడు తన ప్రతాపం చూపిస్తుండటంతో గరిష్ట ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయి. దీనికి తోడు స్కూళ్లల్లో ఫ్యాన్ సౌకర్యం లేక ఉక్కపోతతో విలవిల లాడుతున్నారు. దీంతో కొన్ని స్కూళ్లల్లో చెట్ల కిందనే తరగతులు నిర్వహిస్తున్నారు.

పదవ తరగతి పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో పరీక్ష కేంద్రాలు గల పాఠశాలలో ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12:30 వరకు పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తుండగా, ఒకే కాంపౌండ్ వాళ్ళు మండల పరిషత్ పాఠశాల ఉంటే, ఒకటవ తరగతి నుండి తొమ్మిదవ తరగతి వరకు మధ్యాహ్నం ఒంటి గంట నుండి సాయంత్రం ఐదు గంటల వరకు పాఠశాలలను నిర్వహిస్తున్నారు. మండుటెండలో విద్యార్థులు పాఠశాలకు రావాల్సి వస్తుంది. వచ్చిన తర్వాత గదులు సరిపోకపోవడంతో, వేడి ఉష్ణోగ్రతలో చెట్ల కిందనే చదువును కొనసాగించడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటు న్నారు. మధ్యాహ్నం భోజనం చేసి వచ్చిన తర్వాత, 3 గంటల సమయంలో మరోసారి స్కూళ్లో భోజనం పెడుతుండటంతో వృథాగా మారుతోంది.



ఎండవేడి నుంచి ఉపశమనం కోసం

పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో పరీక్ష కేంద్రాలు గల పాఠశాలకు సెలవులు ప్రకటించారు. కానీ ఇక్కడ సెలవులు ప్రకటించ కపోగా.. మిట్టమధ్యాహ్నం మండు టెండలో తరగతులకు విద్యార్థులు హాజరు కావాల్సి వస్తుంది. దీంతో విద్యార్థులు ఆపసోపాలు పడుతూ తరగతులకు హాజరవు తున్నారు. సాయంత్రం వేళలో తరగతులు నిర్వహించాలని కోరుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విద్యార్థులు, విద్యార్థి తల్లిదండ్రులు కోరుతున్నారు.

దసరా సినిమాలో అంగన్‌వాడీలను కించపరిచే సీన్లు తొలగించాలి

అంగన్‌వాడీల డిమాండ్.. పోస్టర్‌లు దహనం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి/నసురుల్లాబాద్



బాన్సువాడలో సినిమా పోస్టర్‌ల దహనం

దసరా సినిమాలో అంగన్ వాడీలను కించపరిచే సీన్లు తొలగించాలని అంగన్‌వాడీలు డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో సోమవారం అంగన్వాడీ టీచర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఐసిడిఎస్ కార్యాల యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్లు మాట్లాడుతూ దసరా సినిమాలో అంగన్వాడీ ఉద్యోగుల లను కించపరిచే విధంగా సీన్లు ఉన్నాయని వాటిని వెంటనే తొలగించాలని లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

అదేవిధంగా అంగన్‌వాడీ టీచర్లకు హెల్పర్లకు గత 2 నెలల జీతం కూడా ఇవ్వలేదని నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్న అంగన్వాడీ ఉద్యోగులకు సరైన సమయంలో జీతాలు ఇవ్వక తీవ్ర ఇబ్బందులు గురి అవుతున్నామని అదేవిధంగా వేసవి సెలవులు ఇవ్వాలని గతంలో విన్నవించిన వేసవి సెలవులపై ఇంకా స్పష్టత రాలేదని మే నెల వస్తున్న దృశ్య వేసవి సెలవుల పై సర్క్యులర్ జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు దేవకారణ, విజయ లక్ష్మి, పద్మ లత, ఆసిన, ఇందిరా, సుమిత్ర, వెంకట లక్ష్మి, నిర్మల, సునంద తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడలో..

దసరా సినిమాలో అంగన్‌వాడీలను అవమానించినట్టు ఉన్న సన్నివేశాలను వెంటనే తొలగించి చిత్రబృందం క్షమాపణలు చెప్పాలని సీఐటీయూ నాయకులు ఖలీల్ డిమాండ్ చేశారు. బాన్సువాడ పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో చిత్రం పోస్టర్‌లను అంగన్‌వాడీలు దహనం చేశారు. అంగన్‌వాడీలను కించపరిచే విధంగా ఉన్న సీన్‌లను వెంటనే తొలగించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రమాదేవి రోజా రేణుక, శివగంగ అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి పనులు చేస్తే బిల్లులు ఇవ్వరా..?

- సర్వసభ్య సమావేశంలో నిలదీసిన సర్పంచ్‌లు

నవతెలంగాణ-బీర్కూర్



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్

గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం అప్పులు చేసి అభివృద్ధి పనులు చేస్తే ఇంతవరకు బిల్లులు ఇవ్వకపోవడం ఏమిటని సర్పంచులు అధికారు లను ప్రశ్నించారు. సోమ వారం నసురుల్లాబాదు మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ పాల్త్య విఠల్ అధ్యక్షతన నిర్వహించారు. సర్వసభ్య సమావేశంలో మొత్తం 23 అంశాలపై చర్చ జరగాల్సి వుండగా కేవలం 18 శాఖలపై చర్చ జరిగింది. అధికార పార్టీ సర్పంచులు పలు ప్రశ్నలు లేవనెత్తారు. అంకోల్ సర్పంచ్ సాయిలు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి పనులు చేపట్టేందుకు లక్షలాది రూపాయలు కేటాయించామని, కానీ ఇంతవరకు బిల్లులు మంజూరు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. అంకోల్ క్యాంప్ సర్పంచ్ వెంకటరమణ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అధికారులకు ఎన్నిసార్లు సమాచారం ఇచ్చిన పట్టించుకోవడంలేదని కనీసం గ్రామాల్లో పర్యవేక్షణ లేక పోయిందన్నారు. వ్యవసాయ శాఖ పర్యవేక్షణ లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన సభ దృష్టికి తీసుకువచ్చారు.

రెవెన్యూ శాఖ నుంచి ఆర్ఐ హనుమాన్లు మాట్లాడుతూ జీవో 58, 59 ప్రకారం వివిధ గ్రామపంచాయతీ పరిధిలో గ్రామపంచాయతీ కేటాయించిన ఉచిత స్థలాల్లో నివాసమున్నవారికి ప్రభుత్వం పట్టాలిస్తుందన్నారు. పలు శాఖల అధికారులు వారి ప్రగతిని వివరించగా మిగతా శాఖలకు చెందిన అధికారులు సమావేశానికి గైర్హాజరయ్యారు. శాఖలపై పూర్తిస్థాయిలో చర్చ జరగకకుండానే నామమాత్రంగా ముగించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి జన్ను వై ప్రతాప్ సింగ్, రెవెన్యూ ఆర్ఐ హనుమాడ్లు, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, యం పి ఓ రాము మండల కో ఆప్షన్ నెంబర్ ముస్తఫా హుస్సేన్ మండల పరిధి ఎంపిటిసిలు గ్రామ సర్పంచులు మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలి

- బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్
- కలెక్టరేట్ ఎదుట ధర్నా

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి



కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి నినాదాలు చేస్తున్న నాయకులు, కార్మికులు

బీడీ కార్మికులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం బీడీ కార్మికులు పెద్దఎత్తున బైటాయించారు. ఇండ్ల స్థలాలు కేటాయించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ బీడీ కార్మికు లకు ప్రత్యేక బీడీ కాలనీ నిర్మించి ఇవ్వాలని, అలాగే ఇండ్ల స్థలాలు ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం రూ. మూడు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పిఎఫ్ ఉన్నవారికి వెంటనే జీవన భృతి ఇవ్వాలని, పీఎఫ్ లేని కార్మికులకు సైతం పెన్షన్ సౌకర్యం కల్పించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ జితేశ్ వి పాటిల్ స్పందించి బీడీ కార్మికులందరికీ ఇండ్ల స్థలాలు చూసి అర్హులందరికీ బీడీ కాలనీ నిర్మిస్తామని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. అర్హులందరికీ జీవన భృతి రెండు నెలల లోగా వచ్చే విధంగా కృషిచేస్తామని సానుకూలంగా స్పందించి నట్టు తెలిపారు. ధర్నాలో యూనియన్ జిల్లా కోశాధికారి సత్యం, రాజనర్సు, కార్మికులు లావణ్య, లక్ష్మి, షబానా బేగం, సోని, లక్ష్మి, లత, జి లక్ష్మి ఇందిరా, నాగమణి, లక్ష్మితో పాటు బీడీ కార్మికులు పాల్గొన్నారు.

కీడు కాదు.. మేలు చేయాలి

- కులమతాలతో ఇబ్బందులు పెట్టొద్దు
- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న స్పీకర్

నవతెలంగాణ-కోటగిరి

'ఛత్రపతి శివాజీ మహారాజ్ గొప్ప వీరుడు. పరిపాలనలో శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి. ముస్లిం అయిన కబీర్ శ్రీరాముని భక్తుడు. కులాలు, మతాలను అడ్డం పెట్టుకుని ప్రజలను ఇబ్బందులు పెట్టవద్దు. చేతనయిన వరకు పదిమందికి సహాయం చేయాలి, కానీ నష్టం చేయకూడద' స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తనను ఇతర పార్టీల వారు తిడుతారని, విమర్శిస్తారని, కానీ తాను తన పని చేసుకుంటూ వెళ్తానే తప్పా.. వారికి నష్టం చేయాలనే ఆలోచన చేయనని అన్నారు. పోతంగల్ మండలం టాక్లీ గ్రామంలో సోమవారం పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో స్పీకర్ పాల్గొన్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఆవిష్కరిం చారు. అనంతరం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పొద్దు తిరుగుడు పంట కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం టాక్లి నుండి సాలంపాడు వెళ్లే రహదారిపై కోటి రూపాయలతో నిర్మించిన బ్రిడ్జి ప్రారంభించారు. కోటి రూపాయలతో నిర్మించిన డబుల్ బెడ్ రూములను సభాపతి ప్రారంభించారు.

ఈ సమావేశంలో మహారాష్ట్ర ముఖేడ్ ప్రాంతానికి చెందిన ఆధ్యాత్మికవేత్త నరేష్ మారాజ్ పాల్గొని తెలంగాణ అభివృద్ధిని పోచారం శ్రీనివాస్ రెడ్డి కృషిని అభినందించారు. రైతులకు ఎనలేని సేవ చేస్తున్నారని, మహారాష్ట్రలో కూడా బిఆర్ఎస్ పార్టీ ఆదరణ పెరుగుతుందని నరేష్ మహారాజ్ పేర్కొన్నారు.

ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ 'దేశంలో కేసీఆర్ లాగా మరో 28 మంది ముఖ్యమంత్రులు ఉన్నారు. కానీ కేసీఆర్ లాగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఎవ్వరూ అమలు చేయడం లేదు. పేదింటి ఆడబిడ్డ పెళ్ళికి తల్లిదండ్రులు అప్పులు చేయకూడదనే మంచి ఆలోచనతో ప్రారంభించిందే కళ్యాణలక్ష్మీ పథకం. కేవలం తొమ్మిది సంవత్సరాల తెలంగాణ రాష్ట్రంలో ఇన్ని పథకాలు ఉంటే గత 70 ఏళ్ళుగా ఉన్న రాష్ట్రాలలో ఎందుకు లేవు ?. ఆసరా పెన్షన్లతో ఇళ్ళలో వృద్ధులకు గౌరవం పెరిగింది. ఇంటికి పెద్ద కొడుకుగా కేసీఆర్ పెన్షన్ ఇస్తున్నారు. పక్కనే ఉన్న మహారాష్ట్ర లో కేవలం 1000 రూపాయలు ఇస్తున్నారు. మహారాష్ట్ర ప్రజలు కేసీఆర్ వైపు చూస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం రాకముందు లక్ష రూపాయల నిధులు తేవాలంటే కష్టంగా ఉండేది. బాన్సువాడ నియోజకవర్గంలోని మెట్ట ప్రాంతాలకు సాగునీరు అందించడానికి సిద్దాపూర్ రిజర్వాయర్, జాకోర-చందూరు ఎత్తిపోతల పథకాలను నిర్మిస్తున్నామని' తెలిపారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఆర్‌డీవో రాజేశ్వర్, నాయకులు పోచారం సురేందర్‌రెడ్డి, సర్పంచ్ విమల దిగంబర్, ఎంపీపీ సునీత శ్రీనివాసరావు, జెడ్పీటీసీ శంకర్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

విలేకరిపై దాడికి నిరసనగా ఎమ్మార్వోకు మెమోరాండం

- ఇసుక,మొరం మొదలగు సహజ వనరుల దోపిడీ అరికట్టాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విలేకరులు

నవతెలంగాణ-ఏర్గట్ల

విధుల్లో భాగంగా వార్త సేకరణకు వెళ్ళిన విలేకరిపై గుమ్మిర్యాల్ గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు దాడికి దిగడంతో సోమవారం ఏర్గట్ల మండల విలేకరులు ఎమ్మార్వో జనార్దన్ కు మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా విలేకరులు మాట్లాడుతూ... ప్రజల పక్షంగా నిలబడుతూ... సమస్యలు వెలికితీసే క్రమంలో కొందరు అక్రమార్కులు దీనిని జీర్ణించుకోలేక పోతున్నారని, దాడులకు పాల్పడుతున్నారని అన్నారు. విలేకరిపై దాడిని ఖండిస్తున్నామని, అలాగే మండలంలోని అన్ని గ్రామాల్లో అక్రమంగా కొనసాగుతున్న మొరం, ఇసుక, మద్యం వంటి వాటిని అడ్డుకోవాలని, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకొని, విలేకరులకు సహకరించాలని ఎమ్మార్వోను కోరారు. ఈ కార్యక్రమంలో ఏర్గట్ల మండల విలేకరులు పాల్గొన్నారు.

పంటను కాపాడండి

సాగునీరు అందించాలని రైతుల ధర్నా



రాస్తారోకో చేపట్టిన రైతులు

నవతెలంగాణ-మాక్లూర్

సాగు నీరు అంచించి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు. సోమవారం మండలంలోని మాదాపూర్ గ్రామానికి చెందిన రైతులు తమ వరి పొలాలు అందుతున్నాయని, నిజాంసాగర్ కెనాల్ ద్వారా 73వ తుము ద్వారా సాగు నీరు అందించి పంటలను కాపాడాలని రోడ్డుపై ధర్నా నిర్వహించారు. అనంతరం అర్ ఐ షఫీ కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, గ్రమకమిటి సభ్యులు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య తెగువ, పోరాటం ఆదర్శం

- తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరుడి జయంతి వేడుకలు
- నివాళులర్పించిన కలెక్టర్, జిల్లా అధికారులు, పోలీసులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/కంఠేశ్వర్

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య తెగువ, పోరాట పటిమ నేటి యువతరానికి ఆదర్శమని పలువురు కొనియాడారు. దొడ్డి కొమురయ్య జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించాలని ఇటీవలే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో దొడ్డి కొమురయ్య జయంతి నిర్వహించారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు జ్యోతి ప్రజ్వలన చేసి, దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదనపు కలెక్టర్ బి.చంద్రశేఖర్, జిల్లా బీ.సీ సంక్షేమ శాఖ అధికారి నర్సయ్య తదితరులు శ్రద్ధాంజలి ఘటించారు. దొడ్డి కొమురయ్య జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించడం పట్ల కురుమ సంఘం నాయకులు హర్షం వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీ.డీ రాములు, డీఎంహెచ్ఓ డాక్టర్ సుదర్శనం, డీపీఓ జయసుధ, డిడబ్ల్యూఓ సుధారాణి, షెడ్యూ లు కులాల సంక్షేమ శాఖ అధికారిణి శశికళ, నిజామాబాద్ ఆర్డీఓ రవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో..

నిజామాబాద్ పోలీస్ కమిషనరేటు కార్యాలయంలో అదనపు పోలీస్ కమిషనర్ (అడ్మిన్) జి. మధుసుదన్ రావు ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య 96వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జి. మధుసుదన్ రావు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తొలి అమరుడిగా చరిత్ర పుటల్లోకి ఎక్కిన వ్యక్తి అని కొనియాడారు. అప్పటికి ఆయన వయస్సు 20 సంవత్సరాలు కూడా నిండలేదని అన్నారు. కార్యాక్రమంలో ఎ.ఓ శ్రీనివాస్, సూపరింటెండెంటులు శంకర్, గోవింద్, మక్సూద్, సి.సి.ఆర్.బి సిబ్బంది, ఐటీ కోర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ పరిశీలన



నవతెలంగాణ-మెండోరా

మండలంలోని కొడిచర్ల గ్రామంలోని నర్సరీని ఎంపిడిఓ శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ మొక్కలకు ఎప్పటికప్పుడు నీటిని పడుతూ మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు ట్రాన్స్ ప్లాంటేషన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సెక్రటరీ నీత, నర్సరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంప్లెక్స్ యజమానికి నోటీసులు జారీ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లి చౌరస్తా వద్ద మున్సిపల్ అనుమతి లేకుండా నిర్మిస్తున్న కాంప్లెక్స్ యజమాని సుంకం నాగభూషణంకు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్ సోమవారం నోటీసులు జారీ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారి హరీష్, అసిస్టెంట్ టౌన్ ప్లానింగ్ అధికారి వినీత్ లతో అక్రమ కాంప్లెక్స్ నిర్మాణంపై సమీక్షించారు. టీఎస్ బిపాస్ ద్వారా మున్సిపల్ అనుమతి పొందిన తర్వాత పనులు ప్రారంభించాలని అప్పటివరకు నిర్మాణ పనులను నిలిపియాలని నాగభూషణంకు అధికారులు చెప్పారు. సిమెంట్ పిల్లర్‌కు నోటీసును అతికించారు. మున్సిపల్ కమిషనర్ వెంట టౌన్ ప్లానింగ్ అధికారులు హరీష్, వినీత్, సిబ్బంది ఉన్నారు.

దొడ్డి కొమురయ్య నేటి తరానికి ఆదర్శం

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు

నవతెలంగాణ-కంఠేశ్వర్/సిరికొండ/డిచ్‌పల్లి

భూమికోసం, భుక్తి కోసం పోరాడిన దొడ్డి కొమరయ్య నేటి తరానికి ఆదర్శం అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు అన్నారు. సోమవారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య జయంతిని పురస్కరించుకొని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ.. తెలంగాణలో దొరలకు, నిజాం నవాబు నియంతృత్వ విధానాలకు వ్యతిరేకంగా కష్టజీవులను ఐక్యం చేశారన్నారు. భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం దొరలకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి ఆ పోరాటంలో ప్రాణాలను వదిలిన మొదటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడని ఆయన అన్నారు. దేశ్ముఖ్‌లు, జాగిర్దార్, జమీందారులు నిజాంనవాబు కనుసన్నల్లో మెదులుతూ ప్రజలను పీడిస్తూ వెట్టిచాకిరి చేయించుకున్నారన్నారు. విపరీతమైన భారాలు మోపటంతో ప్రజల్లో ఉన్న అసంతృప్తిని పోరాట రూపంలోకి మార్చటానికి అప్పుడు కమ్యూనిస్టులు ఆంధ్ర మహాసభ పేరుతో సంఘాలను ఏర్పాటు చేసి దొరలకు వ్యతిరేకంగా పోరాటాలను నిర్వహించారని తెలిపారు. నేటి భారత పాలకులు తిరిగి అదే పద్ధతుల్లో నియంతృత్వ ధోరణితో తమకు వ్యతిరేకంగా మాట్లాడిన వారిపై ఈడీ, సిబిఐతో దాడులు చేయిస్తూ తమ కనుకూలంగా మార్చుకుంటున్నారని అన్నారు. ప్రజల్లో జాతీయత భావం పేరుతో భావోద్వేగాలను సృష్టిస్తూ



సిరికొండలో..

మతాలు, కులాల పేరుతో అనైక్యతను సృష్టించి రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటున్నారని తెలిపారు. నియంతృత్వ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలందరూ పోరాడి ఓడించినప్పుడే విముక్తి కలుగుతుందని అప్పుడే దొడ్డి కొమురయ్యకు నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.లత, జిల్లా కమిటీ సభ్యులు జంగం గంగాధర్, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

సిరికొండ : హైదరాబాద్ సంస్థానాధీశుడైన ఏడవ నిజాం నవాబు నియంతృత్వ పాలన నుండి తెలంగాణ విముక్తి కోసం దొడ్డి కొమురయ్య చేసిన పోరాటం చిరస్మరణీయం అని సత్యశోదక్ ఎడ్యుకేషనల్ సొసైటీ చెర్మెన్ రావుట్ల నర్సయ్య అన్నారు. 96వ జయంతి సందర్భంగా కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: భారతీయ విద్యార్థి మోర్చా ఆధ్వర్యంలో తెలంగాణ యూనివర్సిటీ లో దొడ్డి కొమురయ్య జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీయ విద్యార్థి మోర్చా రాష్ట్ర కార్యదర్శి జివియం విఠల్ మాట్లాడుతూ... హైదరబాద్‌లో ట్యాంక్ బండ్‌పై దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఏర్పటు చేయాలన్నారు. ఆయన స్ఫూర్తితో బహుజన రాజ్యాధికార పోరాటానికి సిద్ధం కావాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా, విద్యార్థి, నిరుద్యోగ వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని నూతన విద్యా విధానాన్ని రద్దు చేసే వరకు పోరాడాలని అన్నారు. కార్యక్రమంలో టీయూ బాద్యులు రమణ, సూరజ్ ,రవి నాయకులు దినేష్, దినేష్, నరేష్, చక్రి, శ్రీకాంత్ విద్యార్థులు పాల్గొన్నారు.



నివాళ్లు అర్పిస్తున్న సీపీఐ (ఎం) నాయకులు

నేడు చేపూర్‌లో ఎమ్మెల్యే పర్యటన

నవతెలంగాణ-ఆర్మూర్

ఎమ్మెల్యే, పీయూసీ ఛైర్మన్, జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఆశన్నగారి జీవన్‌రెడ్డి మండలంలోని చేపూర్ గ్రామంలో పర్యటించనున్నట్టు సర్పంచుల ఫోరం మండల ఉపాధ్యక్షులు, సర్పంచ్ ఇందూర్ సాయన్న, ఉప సర్పంచ్ నడుకుడ శ్రీనివాసులు సోమవారం తెలిపారు. నమస్తే నవనాథపురం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటిస్తారని 25 లక్షలతో నిర్మించిన సిసి రోడ్లు, తదితర ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

మగ్గం, టైలరింగ్, బ్యూటిషన్‌పై శిక్షణ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ అర్ఎస్ఈసిటిఐ డిచ్ పల్లి ఆధ్వర్యంలో ఈ నెల 10 నుండి మగ్గం వర్క్, టైలరింగ్ (కుట్టు మిషన్), బ్యూటీ పార్లర్ 30 రోజుల శిక్షణ ప్రారంభం కానున్నదని దీనిని సద్వినియోగం చేసుకోవాలని అర్ఎస్ఈసిటిఐ డైరెక్టర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణతో పాటుగా ఉచిత భోజన సదుపాయం, హాస్టల్ వసతి కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. శిక్షణకు కావాల్సిన అర్హతలు 19 నుండి 45. సంవత్సర వయస్సు కలిగి ఉండాలని సూచించారు. శిక్షణకు వచ్చే వారు తమవెంట ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, పదవతరగతి జిరక్స్, 5 పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు తెచ్చుకొని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఏదైనా సమాచారం కోసం ఎస్ బిఐ శిక్షణ కేంద్రం ఘన్‌పూర్ రోడ్ డిచ్‌పల్లిలో సంప్రదించాలని, 08461222428, 08461295428ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేకు వినతి

నవతెలంగాణ-సిరికొండ

జెడ్పిటిసి మాలవత్ మాన్సింగ్ నాయక్, తూంపల్లి బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు ఏశాల మహేందర్ తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను సోమవారం హైదరాబాద్ లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జడ్పీటీసీ గ్రామంలో, మండలంలో నెలకొన్న సమస్యలపై ఎమ్మెల్యేకు వివరించారు. తమ మండలం అభివృద్ధికి అధిక నిధులు మంజూరు చేయాలని ఆయన కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే మండల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని అన్ని అనుబంధ డిగ్రీ కళాశాలలకు చెందిన డిగ్రీ 3వ, 5వ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను సోమవారం తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ విద్యావర్ధిని, యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిణి ప్రొఫెసర్ డాక్టర్ ఎం అరుణ, ఏ ఆర్ సాయ గౌడ్‌తో కలిసి సోమవారం వైస్ ఛాన్సలర్ ఛాంబర్ లో విడుదల చేశారు. 5 వ సెమిస్టర్ పరీక్షల్లో 9,638 విద్యార్థులు పరీక్ష రాయగా 3,788 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని, ఇందులో 2,869 మంది బాలికలు ఉత్తీర్ణత పొందగా, 919 మంది బాలురు ఉత్తీర్ణత సాధించారు. ఈ పరీక్షల్లో 3,156 మంది బాలురు ప్రమోట్ కాగా 2,694 మంది బాలికలు ప్రమోట్ అయ్యారని, మొత్తం 39.30శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిణి ప్రొఫెసర్ డాక్టర్ ఎం అరుణా తెలిపారు.3 వ సెమిస్టర్ పరీక్షల్లో 10,697 పరీక్షలకు హాజరు కాగా 3,375మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని,2,696 మంది బాలికలు ఉత్తీర్ణత సాధించగా, 679 బాలురు ఉత్తీర్ణత పొందారని, 4,054 బాలురు ప్రమోట్ అయ్యారని, 3,268 బాలికలు ప్రమోటెడ్ పొందారని, మొత్తం 31.55శాతం ఉత్తీర్ణత సాధించినట్లు యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిణి ప్రొఫెసర్ డాక్టర్ ఎం అరుణా పేర్కొన్నారు. పరీక్ష ఫలితాల కోసం విద్యార్థులు www.telanganau-niversity. ac.in వెబ్ సైట్ సంప్రదించాలని కోరారు.

టీయూకు త్వరలో నూతన అంబులెన్స్

త్వరలోనే టీయూకు నూతన అంబులెన్స్‌ను కొనుగోలు చేస్తామని, విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా చూస్తామని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ విద్యావర్ధిని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ యూనివర్సిటీలో ప్రస్తుతం ఉన్న అంబులెన్స్ సర్వీసింగ్‌కి వెళ్లడం వల్ల శనివారం రాత్రి అంబులెన్స్ అందుబాటులో లేకపోయిందని పేర్కొనానరు. ఈ విషయాన్ని విద్యార్థులు గమనించాలని సూచించారు.

పదోతరగతి పరీక్షలు ప్రారంభం

నవతెలంగాణ సిరికొండ/ముప్కాల్

మండల పరిధిలో కొండాపూర్, సిరికొండ, పెద్దవాల్గోట్ మోడల్ ఆశ్రమ పాఠశాల్లోని పదవ తరగతి పరీక్ష కేంద్రాలలో మొత్తం 512 మంది విద్యార్థులకు గాను 510 ఇద్దరు పరీక్షకు గైర్హాజరైనట్లు ఎంఈఓ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలు తెలిపారు. సిరికొండ ప్రాథమిక పాఠశాలలో 86 కొండాపూర్ లో ఒక వంద 25 కు గాను ఒక వంద 24 మోడల్ ఆశ్రమ పాఠశాలలో 208 కి గాను 207 పెద్దవాల్గోట్ 93కు 93 విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు.

ముప్కాల్: మొదటిరోజు పదోతరగతి పరీక్షలకు విద్యార్థులు 10 నిమిషాలు ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. ముప్కాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 173 మందికి 173 మంది విద్యార్థులు హాజరయ్యారని మండల విద్యాధికారి బట్టు రాజేశ్వర్ తెలిపారు. మండలంలోని రెంజర్ల ఉన్నత పాఠశాలలో 47కు 47, బాల్కొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 201కి 201, కిసాన్ నగర్ ఉన్నత పాఠశాలలో 72కు 72 మంది విద్యార్థులు హాజరయ్యారని చెప్పారు.

దివ్యాంగులు ఉన్నతస్థాయికి చేరుకోవాలి

- ప్రపంచ ఆటిజం దినోత్సవంలో జడ్పీ చైర్మన్ దాదన్న గారి విట్టల్ రావు

నవతెలంగాణ-కంఠేశ్వర్

దివ్యాంగులుగా పుట్టినందుకు ఎవరు బాధపడకూడదని దివ్యాంగులే రేపటి పౌరులని(ఆణిముత్యాలు) జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విట్టల్ రావు తెలిపారు. నిజామాబాద్ నగరంలోని మారుతి నగర్‌లో గల స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్‌లో ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ ఆటిజం దినోత్సవం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్న గారి విట్టల్ రావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దివ్యాంగులు ఆత్మన్యూనత భావానికి గురికాకుండా కృషి చేసి ఉన్నత స్థాయికి చేరుకోవాలని తెలిపారు. దివ్యాంగులు కూడా రాజకీయ నాయకులుగా ప్రభుత్వ ఉద్యోగులుగా డాక్టర్లుగా తయారు కావచ్చు అని తెలిపారు. విశిష్ట అతిథిగా మానసిక వైద్య నిపుణులు డాక్టర్ విశాల్ హాజరై మాట్లాడుతూ.. చాలామంది ముఖ్యులు ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, చార్లెస్ డార్విన్, ఐజాక్ న్యూటల్, మైక్రోసాఫ్ట్ అధినేత బిల్ గేట్స్ ఆటిజంతో బాధపడ్డ వారేనని గుర్తు చేశారు. అటిజం అనేది అది



మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

మానసికపరమైన వైకల్యమని, కమ్యూనికేషన్ లోపం వల్ల భావ వ్యక్తీకరణ ఉండదని తెలిపారు. చాలా మంది తల్లిదండ్రులు ఆటిజం బారినపడిన పిల్లలను మానసిక వికలాంగులుగా చూస్తారని అన్నారు. వారి సమస్య ను బట్టి శిక్షణ ఇచ్చినట్లయితే వారిలో అభివృద్ధి సాధారణంగా ఉంటుందన్నారు. పిల్లలు ఆటిజంతో పుట్టడానికి ప్రధాన కారణం తల్లి గర్భవతిగా ఉన్నప్పుడు ఇమ్యునైషేషన్ తీసుకోక పోవడం, ఐరన్ టాబ్లెట్ వాడకపోవడం, మత్తు పదార్థాలు అధికంగా తీసుకోవడం వల్ల పిల్లల నాడి వ్యవస్థ దెబ్బతిని ఆటిజం లోపం వస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతి వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి, మానసిక వికలాంగ విద్యార్థులు, సిబ్బంది, పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం



నూతన సభ్యులను సన్మానిస్తున్న నసీమా సుల్తాన

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ బార్ అసోసియేషన్ 2023-24 నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం సోమవారం కోర్టు ఆవరణలో నిర్వహించారు. నూతన సభ్యులతో ఎన్నికల అధికారి గటాడి ఆనంద్ ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షునిగా సరసం చిన్నారెడ్డి, ఉపాధ్యక్షునిగా యేసు జగన్, ప్రధాన కార్యదర్శిగా అయినారి అశోక్, కోశాధికారిగా అరుణ్ కుమార్, సంయుక్త కార్యదర్శిగా మధుసూదన్ రెడ్డి, గ్రంథాలయ కార్యదర్శిగా సుఖేష్, మహిళ ప్రతినిధిగా దోండి సవిత ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి సీనియర్ సివిల్ జడ్జి నసీమా సుల్తానా ముఖ్య అతిథిగా హాజరై నూతన కార్యవర్గ సభ్యులకు పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు జూనియర్ జడ్జి దీప్తి, రెండవ తరగతి జడ్జి వెంకటేష్, న్యాయవాదులు భూపతిరెడ్డి, జగదీశ్వరెడ్డి, గంగారెడ్డి, రాజేశ్వర్, తులసీదాస్ క్రాంతి, కృష్ణంరాజు కోనేరు, కృష్ణ నెహ్రూ, సుభాష్, రాజేశ్వర్, దశ గౌడ్, రాజేందర్, శ్రావణ్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

కొడుకు పట్టించుకోవట్లేదని ఒకరు.. కొడుకు ఆరోగ్యం కోసం మరో తల్లి





నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

తన కొడుకు అనారోగ్య పరిస్థితిని ప్రభుత్వం పట్టించుకుని బాగు చేయాలని వేడుకుంటూ ఓతల్లి సోమవారం కలెక్టర్ కార్యాలయానికి తరలివచ్చింది ఆర్మూర్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన హారిక తన కుమారుడు ఎనిమిది సంవత్సరాలు వయసు వచ్చిన అనారోగ్య సమస్య తగ్గడం లేదని తెలిపింది. ఇందుకు 10 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్య నిపుణులు తెలిపారని అన్నారు. ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించుకునేందుకు డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నామని ఆర్థిక సహాయం అందించాలని అన్నారు. బ్రెయిన్‌లో నీరు చేరడం వల్ల తల పెద్దగా తయారైందని పాలు తాగుతునే బతుకు తున్నాడని తెలిపారు.

అన్నంపెట్టడంలేదు..

కోనసముద్రం గ్రామానికి చెందిన నల్లూరి గంగ తన భర్త అనారోగ్య సమస్యతో చనిపోయాడని, అనారోగ్యానికి అయిన ఖర్చులతో ఆర్థిక ఇబ్బందులు ఏర్పడ్డాయని వాటి అప్పులను తీర్చుటకు తన కొడుకుని కోరగా అప్పులు తీర్చకపోగా ఆస్తిని తన పేరుకు మార్చుకున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. తన కుమారుడు కనీసం ఆహారం పెట్టడం లేదని వాపోయింది. తనకు గంజి పోయాలని కోరింది.

పల్లెపల్లెకు ఓబీసీ కరపత్రాల ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆర్మూర్

'పల్లెపల్లెకు ఓబిసి-ఇంటింటికి బిజెపి' కార్యక్రమంలో భాగంగా ఓబిసి మోర్చ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని పెర్కిట్‌లో నిర్వహించినట సమావేశంలో కరపత్రాలు, గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు యామాద్రి భాస్కర్ మాట్లాడుతూ....కేంద్ర నరేంద్ర మోడీ ప్రభుత్వం ఓబీసీల అభివృద్ధికి ఎన్నో రకాల పథకాలను అమలు చేయడమే కాకుండా అవి కార్యరూపం దాల్చాయన్నారు. 105 వ రాజ్యాంగ సవరణ చట్టం ప్రకారం సామాజికంగా విద్యాపరంగా వెనుకబడిన తరగతుల వారి రాష్ట్రాల ఓబిసి జాబితాలో స్పందించే హక్కు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు కల్పించిందన్నారు. 2017లో ఓబిసి క్రిమిలేయర్ ఆదాయాన్ని ఆరు లక్షల నుండి 8 లక్షలకు పెంచారని తెలిపారు. ఓబీసీ విద్యార్థులకు 7565 కోట్ల స్కాలర్ షిప్ లను 44500 నుండి 2.5 లక్షల వరకు పెంచడం జరిగిందని చెప్పారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం 9 ఏళ్లలో ఓబీసీలను అన్ని రంగాలలో అణిచివేయడం తప్ప అభివృద్ధి చేసే ఆలోచనలో లేదని. స్థానిక సంస్థల ఎన్నికలలో 33శాతం ఉన్న బీసీ రిజర్వేషన్లను దాదాపు 10శాతం తగ్గించిందన్నారు. ఈ విషయాలన్నీ ప్రజలకు తెలియజేసి, తెలంగాణలో భారతీయ జనతా పార్టీ జెండా ఎగిరే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో చెన్నూరు అసెంబ్లీ ఇంచార్జ్ పుప్పాల శివరాజ్ కుమార్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ నరసింహారెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు నూతుల శ్రీనివాస్ రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు ద్యాగ ఉదయ్, పట్టణ అధ్యక్షులు జెస్సు అనిల్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు పోల్కం వేణు, విజయానంద్, పట్టణ ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి మిర్యాల్ కర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సమతుల్య ఆహారం తీసుకోవాలి

- మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత పవన్



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ పండిత్ వినీత పవన్

నవతెలంగాణ-ఆర్మూర్

సమతుల్య ఆహారం తీసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత పవన్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో సోమవారం పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రోగాల బారిన పడకుండా ఉండేందుకు సమతుల్య ఆహారం తీసుకోవాలని, రోజుకు ఐదు లీటర్ల నీరు తాగాలని యోగ ఎక్సర్‌సైజ్ చేయాలని అంగన్వాడి టీచర్లకు సూచించారు. అంగన్వాడి టీచర్లు నిర్వహించవలసిన బాధ్యతలను వివరించారు హోప్ హాస్పిటల్ డాక్టర్ హార్ట్ ఎటాక్ వచ్చిన వ్యక్తిని సీపీఆర్ ద్వారా ఎలా బతికించాలో తెలిపారు. వెంటనే అంబులెన్స్ కు కాల్ చేసి హాస్పిటల్‌లో చేరిస్తే బతికే అవకాశం ఉంటుందని అన్నారు. సీపీఆర్ ఎలా చేయాలో అంగన్వాడి టీచర్లకు ప్రత్యక్షంగా చూపించారు. తినే ఆహారం మితమంగా ఉండాలని, నాన్ వెజ్ తినవద్దని, దీని ద్వారా మన శరీరంలో పొట్టలో కొవ్వు పేరుకుపోయి పొట్ట ఉబ్బడం అధిక బరువు పెరగడం ఇలాంటివి గుండెపోటుకు దారితీస్తాయని, అలాగే బిపి షుగర్ రోగాలకు కూడా దారి తీసే అవకాశం ఉందని వివరించారు. టీచర్లు తీసుకువచ్చిన పోషక ఆహార వంటలను పరిశీలించారు. అనంతరం ప్రశంస పత్రాలను అందించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్, సీడీపీవో, ఏసీడీపీవో, సూపర్వైజర్లు, డాక్టర్లు, అంగన్వాడి టీచర్లు, ఆయాలు, సిబ్బంది పాల్గొన్నారు.

కోటార్మూర్‌లో అన్నదానం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని కొటార్మూర్‌లో శ్రీ రమ సత్యనారాయణ స్వామి ఆలయంలో సోమవారం ఆలయ కమిటీ, గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆలయంలో అభిషేకాలు, సామూహిక సత్యనారాయణ వ్రతాలు, స్వామి కళ్యాణ మహోత్సవం, ఊరేగింపు, రథోత్సవం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు విశాఖ గంగారెడ్డి, ఏడో వార్డు బి ఆర్ఎస్ అధ్యక్షులు సత్యం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలకేంద్రానికి చెందిన ఇద్దరికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. జక్రాన్‌పల్లి గ్రామానికి చెందిన నోముల సాయన్న 19వేలు, చింతలపల్లి బుచ్చవ్వకు 7వేలు సర్పంచ్ చంద్రకళ బాలకిషన్. ఎంపీటీసీ గంగారెడ్డి. పార్టీ మండల అధ్యక్షులు నట్ట భోజన్న అందజేశారు.

పుట్టబోయే బిడ్డ లింగనిర్ధారణ పరీక్షలు నేరం

నవతెలంగాణ-సిరికొండ

పుట్టబోయేది ఆడబిడ్డనా.. లేక మగ బిడ్డనా.. అని అడగడం చట్టరిత్యా నేరమని హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆశలు, హెల్త్ అసిస్టెంట్లు, అంగన్వాడీ కార్యకర్తలకు, ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టబోయేది ఆడబిడ్డనా.. మగ బిడ్డనా అని స్కానింగ్ ద్వారా తెలుసుకొని చెప్పడం నేరమని, అందుకు శిక్ష తప్పదని తెలిపారు. గర్భిణులకు ఆశలు, అంగన్వాడి కార్యకర్తలు దీనిపై అవగాహన కల్పించాలని వివరించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి అరవింద్, సిహెచ్ఓ అనంతరావు, అంగన్వాడి సూపర్వైజర్లు, ఆశ కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటేష్

అప్రైజర్ సిబ్బంది మధ్య మాటల యుద్ధం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి మండల కేంద్రంలోని కో-ఆపరేటివ్ సహకార బ్యాంకులో సోమవారం మధ్యాహ్నం గోల్డ్ స్మిత్ (అప్రైజర్)కు, బ్యాంకుసిబ్బందికి మధ్య మాటల యుద్ధం సాగింది. బ్యాంకులో బంగారు తాకట్టుపెట్టి రుణాలు తీసుకునేందుకు వచ్చిన ప్రజలకు గంటల తరబడి వేచి ఉండావల్సి వస్తుందని ప్రజలు బ్యాంకు సిబ్బందికి సూచించారు. బంగారు నగలను గోల్డ్మిత్ అప్రైజర్ తూకం వేసి బంగారమ్‌కు ఎంత రుణం వస్తుందో లెక్కలు వేసి వాటిపై రుణం తీసుకునే వ్యక్తులది, అప్రైజర్ ప్రజల సంతకాలు తీసుకోకుండానే బ్యాంకు అధికారులకు ఇవ్వడంతో బ్యాంకు సిబ్బందికి అప్రైజర్కు మధ్య మాటల యుద్ధం సాగింది. బ్యాంకు అధికారులు చేసే పని తాము చేయలేమని మీకు అవసరముంటే పనిలో ఉంచుకోండి లేదంటే నన్ను తొలగించండి అంటూ బ్యాంకు సిబ్బందికి బహిరంగంగానే అప్రైజర్ సమాధానం ఇచ్చారు. గంటల తరబడి గోల్డ్ లోన్ కోసం ప్రజలు ఇబ్బంది పడుతున్నారని మీ పనితీరు బాగాలేదని బ్యాంకు సిబ్బంది అప్రైజర్ మండిపడ్డారు. అప్రైజర్‌ను మార్చాలని ఉన్నతాధికారులకు లేఖ పంపుతామని బ్యాంకు సిబ్బంది అప్రైజర్‌కు సమాధానం ఇచ్చారు.

ఆరోగ్యం కోసం ఆటలు తప్పనిసరిగా ఆడాలి

- శ్రీనివాస్ రెడ్డి సుభాష్‌గౌడ్ గార్డెన్ ఫౌండర్ మేనేజింగ్ డైరెక్టర్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఈ రోజుల్లో ఆస్తులు అంతస్తులు సంపాదించడం కాదని, ఆరోగ్యంగా ఉండటమే జీవిత లక్ష్యంగా పెట్టుకోవాలని, ఆరోగ్యంగా ఉండాలంటే విద్యార్థులు ఆటలు తప్పనిసరిగా ఆడాలని శ్రీనివాస్ రెడ్డి సుభాష్ గౌడ్ గార్డెన్ ఫౌండర్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నారు. సోమవారం మండలంలోని సుద్ద పల్లి సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల/కళాశాల క్రీడా మైదానంలో జరిగిన నిజామాబాద్ జిల్లా మినీ-సబ్ -జూనియర్ (అండర్-10) సాఫ్ట్ బాల్ బాల బాలికలు, మిక్స్ టోర్నమెంటు ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఓటమి చెందిన జట్లు నిరుత్సాపడకుండా విజయం సాధించడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరైన జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి బొజ్జ మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ.. మేలో జరిగే జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ఎక్కువ మొత్తంలో ప్రాతినిధ్యం వహించేలా కృషి చేయాలన్నారు. ఈ టోర్నమెంటు బహు మతుల దాత శ్రీ రాజరాజేశ్వర సీడ్స్, ఫర్టిలైజర్ షాప్ ప్రొప్రేటర్ గోక చిన్న గంగారం (పిప్రి గ్రామం) మాట్లాడుతూ.. సాఫ్ట్ బాల్ క్రీడలో ఎంతోమంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణించడంపట్ల సంతోషంతో బహు మతులు అందజేశానని తెలిపారు. క్రీడాకారులకు తన వంతు ప్రోత్సాహాన్ని ఇస్తానన్నారు. టోర్నమెంట్‌ను నిర్వహించిన పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయులు నల్లూరి లత, జిల్లా క్రీడాకారులను రాష్ట్ర జాతీయ అంతర్జాతీయ పోటీలలో పథకాలు సాధించే విధంగా శిక్షణ ఇస్తున్న సాఫ్ట్ బాల్ అకాడమీ ఇంచార్జ్ కోచ్ వేముల మౌనికను జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్‌వారు సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు వి ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్, తెలంగాణ యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బీర్ నేత,పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ స్వరూప,జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ సభ్యులు నల్లూరి లత, భాగ్య, జోష్ణ, వినోద్, సంతోష్ ,గంగాధర్, ధర్మపురి, అనిల్, సురేష్, ప్రవీణ్, రాజేందర్, సాఫ్ట్ బాల్ అకాడమీ కోచ్‌లు ఇట్యాల నరేష్, వేముల మౌనిక పాల్గొన్నారు.



బహుమతులు ప్రదానం చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

రూరల్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయనిధి నుండి 42మందికి మంజూరైన చెక్కులు రూ.14,18,100 లబ్ధిదారులకు సోమవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జిల్లా యువ నాయకులు, జిల్లా పరిషత్ ఆర్థిక ప్రణాళిక సంఘ సభ్యులు, ధర్పల్లి జెడ్పిటిసి, జిల్లా ఒలంపిక్ సంఘం ఉపాధ్యక్షులు బాజిరెడ్డి జగన్మోహన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పిటిసి దాసరి ఇందిరా లక్ష్మీ నర్సయ్య, మండల అధ్యక్షులు చింత శ్రీనివాస్ రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షులు మోహన్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు గీత, మాజీ అధ్యక్షులు శక్కరి కొండ కృష్ణ, దళిత నాయకుడు పద్మారావు, సర్పంచులు, ఎంపిటిసిలు, ఉప సర్పంచులు, కార్యకర్తలు, బీఆర్ఎస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పిల్లల పోషణార్థం నిరుపేద దంపతులకు ఆర్థిక సహాయం

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని రాకాసిపేట్‌కు చెందిన నరేష్, అనిత దంపతులకు ఒకే కాన్పులో ముగ్గురు సంతానం కలగడం పిల్లల పోషణార్థం ఇబ్బందులు తలెత్తడంతో బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ సతీమణి ఆయేషా ఫాతిమా ఆమె స్థాపించిన ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేద దంపతులకు లక్ష రూపాయల ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా నరేష్, అనిత దంపతులు ఆయేషా ఫాతిమాకి కృతజ్ఞతలు తెలిపారు.



బాధిత పిల్లలతో సరదాగా.. ఎమ్మెల్యే సతీమణి

ప్రారంభమైన పది పరీక్షలు

- మొదటిరోజు ప్రశాంతం

నవతెలంగాణ-విలేకరుల బృందం

పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. కాగా మొదటి రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్టు ఆయా మండలాల ఎంఈవోలు తెలిపారు. వర్ని, లింగంపేట్, రామారెడ్డి, దోమకొండ, జుక్కల్, తదితర మండలాల్లో పరీక్షలు ప్రశాంతంగా కొనసాగినట్టు విద్యాధికారులు తెలిపారు.



రామారెడ్డి : పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

చెరువులో దూకి రిపోర్టర్ ఆత్మహత్య

నవతెలంగాణ-నసురుల్లాబాద్



నసురుల్లాబాద్ మండల కేంద్రానికి చెందిన ఓ పత్రికలో పనిచేసే రిపోర్టర్ ఉల్లేగి సాయిలు ఆదివారం రాత్రి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిన సాయిలు సోమవారం ఉదయం వరకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. ఊర చెరువు వద్ద చెప్పులు ఉండడంతో గజ ఈతగాళ్లతో గాలించగా.. సాయిలు మృతదేహం లభ్యమైంది. రెండు నెలల క్రితం కుడి చేయి విరగడంతో హాస్పిటల్‌లో చికిత్స పొందినా గాయం నయం కాకపోవడంతో మానసికంగా కృంగిపోయి ఆత్మహత్య చేసుకున్నట్టు తెలిసింది. మృతుడి తమ్ముడు సాయిలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

నవతెలంగాణ-దోమకొండ



అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి చెందిన ఘటన దోమకొండ మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కామినేని దిరాజ్ (37) ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లాడు. దోమకొండ ఎల్లమ్మగుడి వద్ద ఉన్న కల్లు డిపో వద్ద కల్లు, మద్యం సేవించి సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నాడు. మృతుని అన్న కామినేని సుధీర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-బోధన్



సాలూర మండలంలోని ఖాజాపూర్ గ్రామానికి చెందిన చింతం మారయ్య(42) అనే వ్యక్తి మద్యానికి బానిసై జీవితంపై విరక్తితో సోమవారం తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు బోధన్ రూరల్ ఎస్ఐ సందీప్ తెలిపారు. మృతుడు మద్యానికి బానిసై, ఎలాంటి పనిచేయక తిరిగేవాడు. చనిపోతానంటూ భార్య పిల్లలను బెదిరించేవాడు. గతంలోను పలుమార్లు ఉరేసుకుని చనిపోతానంటూ కుటుంబీకులకు భయపెట్టాడు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య లాలాబాయి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హనుమాన్ ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం

నవతెలంగాణ-కామారెడ్డిటౌన్

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని హరిజనవాడలో గల 'శ్రీశ్రీశ్రీ కోడూరి హనుమాన్ దేవాలయం' పునర్నిర్మాణంలో భాగంగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నిట్టు వేణుగోపాలరావు సోమవారం పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, కైలాస్ రాజేశ్వరరావు, చింతల రమేష్, పెంట నర్సింలు, పుల్లూరి సతీష్, ముప్పారపు ఆనంద్, గెరిగంటి లక్ష్మీనారాయణ, కుంబాల రవి యాదవ్, పిల్లి మల్లేష్, పిట్ల వేణుగోపాల్, హన్మండ్ల సురేష్, మాసుల లక్ష్మీనారాయణ, పిడుగు మమతా సాయిబాబా, జూలూరి సుధాకర్, అన్నారం మోహన్‌రెడ్డి, అన్నారం చిన్న వెంకటరెడ్డి, దుబ్బాక ప్రసాద్, కట్లకుంట్ల రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌లో 'శివాజీ స్మృతి' దినోత్సవం

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలో శివసేన పార్టీ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ స్మృతి దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోధన్ అంబేద్కర్ చౌరస్తాలో ఛత్రపతి శివాజీ విగ్రహానికి పాలతో, నీటితో అభిషేకించి పూలతో ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గోపికిషన్, శివసేన నాయకులు గౌతమ్, కిరణ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో ఆడుకోవడమే బంగారు తెలంగాణనా..?

నవతెలంగాణ-రామారెడ్డి

విద్యార్థుల జీవితాలతో ఆడుకోవడమే బంగారు తెలంగాణనా? అని జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. విద్యార్థులు రాసే ప్రతి పరీక్ష పేపర్లు లీక్ కావడం ప్రభుత్వ పనితనానికి నిదర్శనమని, విద్యార్థుల జీవితాలతో ఆడుకోవడం మంచిది కాదని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని, అక్రమాలకు పాల్పడుతున్న బడా బాబులను బయటకు తేవాలని సూచించారు.

ప్రతి ఒక్కరికీ కంటి చూపు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- వైద్యాధికారులు


నవతెలంగాణ-విలేకరుల బృందం

ఎడపల్లి : సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన రెండవ విడత కంటి వెలుగు పథకంలో ప్రతి ఒక్కరికీ కంటి చూపు అందించడమే లక్ష్యమని, సీఎం అమలు చేస్తున్న ఈ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇంచార్జ్ వైద్యాధికారి రాజ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని ఏఆర్పీ క్యాంప్ గ్రామపంచాయతీలో కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం నుంచి సాయంకాలం వరకు సుమారు 80 మందికి పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. దగ్గర, దూరం కంటి చూపుతో ఇబ్బందులు పడుతున్న వారిని గుర్తించి వారికి కంటి వెలుగు అద్దాలను పంపిణీ చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, అంగన్వాడీ ఉపాధ్యాయురాలు సుజాత, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి..

సదాశివనగర్ : మండలంలోని లింగంపల్లి గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ గైని అనుసూయ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కంటి వెలుగు శిబిరాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గుండెల్లి సాయిలు, జడ్పీటీసీ కమిలి నర్సింలు, డాక్టర్ అస్మా అఫ్రిన్, సూపర్‌వైజర్ నాగరాజు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగులో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలి..



కంటివెలుగును ప్రారంభిస్తున్న ఎంపీపీ

ఎల్లారెడ్డి : మండలంలోని లక్ష్మపూర్ గ్రామంలో ఎంపీపీ మాధవి బలరాజ్‌గౌడ్ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న దృష్ట్యా కంటి వెలుగు కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రవీందర్ గౌడ్, ఆశావర్కర్లు, ఏఎన్ఎం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య స్ఫూర్తిని కొనసాగించాలి

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్
- ఘనంగా జయంతి వేడుకలు

నవతెలంగాణ-విలేకరుల బృందం

కామారెడ్డి : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, తొలి అమరుడు దొడ్డి కొమురయ్య స్ఫూర్తిని కొనసాగించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కొమురయ్య 96వ జయంతి వేడుకలను జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో కురుమ యువ చైతన్య సమితి కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు మామిడి సంజీవ్ కురుమ అధ్యక్షతన అధికారికంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి కలెక్టర్ మాట్లాడుతూ.. ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలని పేర్కొన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు మామిడి సంజీవ్ మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య జయంతి, వర్ధంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం చాలా సంతోషమని అదేవిధంగా ఆ మహనీయుని విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై పెట్టాలని, ఆయన చరిత్రను పాఠ్య పుస్తకాల్లో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, కురుమ యువ చైతన్య సమితి కామారెడ్డి జిల్లా గౌరవ అధ్యక్షుడు కురుమ సాయిబాబా, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పెద్దోళ్ల మహేష్ కురుమ, జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రోళ్ల స్వామి, జిల్లా గౌరవ సలహాదారులు సంగయ్య (తాండూర్ సర్పంచ్), జిల్లా కోఆర్డినేటర్ చెట్కూరి ప్రణీత్, బీసీ సంక్షేమ సంఘం కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు సాప శివరాములు, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు రాజయ్య, కురుమ సంఘం నేతలు తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డి : నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు



తాడ్వాయిలో..

తాడ్వాయి : జాతీయ బీసీ యువజన సంఘం కామారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సాయుధ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య జయంతి వేడుకలను తాడ్వాయి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన గురించి కొనియాడారు. అనంతరం యువజన సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. దొడ్డి కొమురయ్య వీరోచిత పోరాటం భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిదాయకమని, అదే స్ఫూర్తితో బీసీలు సామాజికంగా ముందుకు సాగాలని అన్నారు. కార్యక్రమంలో తాడ్వాయి సర్పంచ్ సంజీవులు, వైస్ ఎంపీపీ నర్సింలు, బీసీ యూత్ అధ్యక్షులు రాజీవ్ కుమార్, యూత్ ప్రధాన కార్యదర్శి అఖిల్‌రావు, బీసీ మండలాధ్యక్షులు సాయిబాబా, యూత్ మండలాధ్యక్షులు భాస్కర్, అనిల్, కాంగ్రెస్ జిల్లా యూత్ నాయకులు రామారెడ్డిపేట రాజశేఖర్, ప్రశాంత్ పాల్గొన్నారు.

బోధన్ : తొలిదశ తెలంగాణ ఉద్యమకారులు దొడ్డి కొమరయ్య 96వ జయంతి సాలూర మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మమత దొడ్డి కొమరయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. దొడ్డి కొమరయ్య పోరాట పటిమను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ అల్లే జనార్దన్, కురుమ సొసైటీ మండలాధ్యక్షులు సిరిగిరి దేవరవు, మంధర్నా సర్పంచ్ గంగాధర్, బోధన్ మండల కురుమ సంఘం అధ్యక్షులు రవి, యూత్ అధ్యక్షులు పరశురాం సకండెల సంజీవ్, సాలూర కురుమ సంఘం అధ్యక్షులు భూమయ్య, ఎల్ఐసీ మేనేజర్ సుధాకర్, వెంకట్ పటేల్, శెట్టిగొండ, అంజయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీలో..

బోధన్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఏఎంసీ చైర్మెన్ వీఆర్ దేశాయి ఆధ్వర్యంలో దొడ్డి కొమరయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలువేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు నక్క లింగారెడ్డి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సాయుధ పోరాట అమరుల త్యాగాలు చిరస్మరణీయం..

రామారెడ్డి : తెలంగాణ సాయుధ పోరాటంలో, నిజాం రాజులను, రజాకార్లను ఎదిరించి భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం ఎందరో మహనీయుల అమరత్వం చిరస్మరణీయమని స్థానిక ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని పోసానిపేట, గొల్లపల్లిలో దొడ్డి కొమరయ్య 96వ జయంతి వేడుకలను స్థానిక సర్పంచులు జిరెడ్డి మహేందర్‌రెడ్డి, పాల లావణ్య, కురుమ సంఘం మండల అధ్యక్షులు పాల మల్లేష్, కురుమ సంఘం పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుతారి నరేష్, నరసయ్య, కురుమ సంఘం పెద్దలు, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమం డిపార్ట్మెంట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ తరఫున చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఇంచార్జి ప్రిన్సిపాల్ ఏ.ప్రభాకర్‌రావు అధ్యక్షత వహించగా హిస్టరీ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ జయప్రకాష్ ముఖ్య వక్తగా మాట్లాడారు.

ప్రజల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే హన్మంత్ షిండే

నవతెలంగాణ-పిట్లం

ప్రజల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ షిండే అన్నారు. సోమవారం మండలంలోని చిల్లర్గి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర సీఎం కేసీఆర్ ప్రజలకు నూతన ఒరవడితో పలు సంక్షేమ పథకాలు అమలు పరుస్తూ ప్రజలను ముందుకు తీసుకెళ్తున్నారని కొనియాడారు. రేషన్‌తో పాటు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్టు, ఆరోగ్య లక్ష్మి, న్యూట్రిషన్ కిట్టు, పలు పెంఛన్లు అందిస్తున్నారని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి గాను సీసీ రోడ్లు, మురికి కాలువలను అభివృద్ధి పరుస్తున్నామని వివరించారు. మద్దెల చెరువు నుంచి పిట్లం మీదుగా తిమ్మానగర్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణం చేశామన్నారు. సిద్దాపూర్ వయా చిల్లర్గి, పొరడ్‌పల్లి నుంచి పెద్దకొడప్‌గల్ వరకు గల పంచాయతీరాజ్ రోడ్డును ఆర్అండ్‌బీ రోడ్డుగా మారుస్తూ డబుల్ రోడ్డు నిర్మాణానికి సీఎం కేసీఆర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారన్నారు. నాగమడుగు ఎత్తిపోతల పథకం పనులు నిర్వహిస్తున్నందున మాగి షుగర్ ఫ్యాక్టరీ నుంచి వయా మల్లూరు, ఒడ్డెపల్లి, అన్నారం గేట్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ మంజూరి ఇచ్చారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, పార్టీ శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

రాంపూర్ కుస్తీ పోటీలు

- తలపడిన మహిళా యోధులు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని రాంపూర్ గ్రామంలో సోమవారం మధ్యాహ్నం నుంచి నిర్వహించిన కుస్తీ పోటీల్లో యువతులు ఆసక్తిగా పాల్గొన్నారు. మొట్ట మొదటిసారిగా కుస్తీ పోటీల్లో మహిళలు రావడంతో వారి కుస్తీలను తిలకించడానికి దూర ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. టెంకాయ కుస్తీ నుంచి పోటీలు మొదలయ్యాయి. 300 రూపాయల కుస్తీ పోటీలో యువతులు పురుషులను ఓడించారు. గెలుపొందిన వారికి సర్పంచ్ హనుమవ్వ కిషన్ చేతుల మీదుగా వెండి కడియాలతో పాటు నగదును సైతం అందజేశారు.



తలపడుతున్న మల్లయోధులు

ప్రజల విజ్ఞప్తులను సత్వరమే పరిష్కరించాలి

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ప్రజల విజ్ఞప్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 58 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, డీఆర్‌డీఓ సాయన్న, జిల్లా అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్య ప్రయోజనాలు

- అంగన్వాడీల్లో పోషక పక్వాడ్

నవతెలంగాణ-రామారెడ్డి/దోమకొండ

మండలంలోని మద్దికుంట అంగన్వాడీ కేంద్రంలో సోమవారం పోషక పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్ బొమ్మిడి సుజాత గర్భిణీలను, బాలింతలను, కిషోర్ బాలలను ఉద్దేశించి మాట్లాడుతూ.. చిరుధాన్యాలతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ చిరుధాన్యాలైన శనగలు, పెసర్లు, బబ్బర్లు, తోపాటు పాలు, గ్రుడ్లు, వంటి పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో టీచర్లు మూడ వెంకటలక్ష్మి, గజ్జల సుజాత, ఆయాలు రాధా, మైసవ్వ, భారతి, తల్లులు, గర్భిణీలు తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ : మండల కేంద్రంలోని పైడిమరి నిలయంలో ఐసీడీఎస్ సీడీపీఓ రోచిష్మ ఆధ్వర్యంలో పోషణ పక్షం చిరుధాన్యాలపై ప్రాజెక్టు గర్భిణీలకు, బాలింతలకు, అంగన్వాడీ టీచర్లకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీఓ రోచిస్మా, జడ్పీటీసీ తీర్మాల్‌గౌడ్ మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాలలో పోషణ ఆహార అలవాట్లు, చిరుధాన్యాలతో బాలింతలు, గర్భిణీలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. జడ్పీటీసీ తీగల తిరుమల్‌గౌడ్ మాట్లాడుతూ.. ఆహారపు అలవాట్లు, చిరుధాన్యాలు, మంచి పౌష్టికాహారం అందించాలని, గర్భిణులకు బాలింతలకు అంగన్వాడీ టీచర్లకు అవగాహన కల్పించారు.

అనంతరం శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ శారదా, వైస్ ఎంపీపీ పుట్ట బాపురెడ్డి, ఎంపీటీసీ కోట సదానంద, భిక్కనూర్ వ్యవసాయ మాజీ చైర్మన్ కుంచాల శేఖర్, కోఆప్షన్ సభ్యులు షమ్మీ కదిరే నరసింహారెడ్డి, ఐకేపీ సభ్యులు రాజు, సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు ఆయాలు పాల్గొన్నారు.



రామారెడ్డి : అవగాహన కల్పిస్తున్న టీచర్

సంతోష్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-మద్నూర్

బీఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు సంతోష్ మేస్త్రీ తల్లి ఇటీవల మరణించిన సందర్భంగా జుక్కల్ ఎమ్మెల్యే హనుమంతు షిండే సోమవారం మద్నూర్ మండల కేంద్రాన్ని సందర్శించి సంతోష్ మేస్త్రీ ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. అతని తల్లి మరణించిన దానిపై వివరాలు అడిగి తెలుసుకుని ఎమ్మెల్యే ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సంగమేశ్వర్, స్థానిక సర్పంచ్ సురేష్, ఎంపీటీసీ కుటుంబ సభ్యులు, పార్టీ మండల ప్రచార కార్యదర్శి రచ్చ కుశాల్, మార్కెట్ డైరెక్టర్ అవార్ హనుమాన్లు, రైతు సమన్వయ సమితి గ్రామ అధ్యక్షులు కంచి హనుమాన్లు, నాయకులు శివాజీ, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీయడమే సెమినార్ లక్ష్యం

- తెలంగాణ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నాగరాజు

నవతెలంగాణ-బోధన్

విద్యార్థులలోని ప్రతిభా, పాటవాలను, నైపుణ్యాలను, శక్తిసామర్థ్యాలను వెలికితీయడానికి కళాశాల స్థాయిలో సెమినార్ల నిర్వహణ ముఖ్య ఉద్దేశమని తెలంగాణ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఏ నాగరాజు అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని ఉషోదయ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అంతర్జాతీయ డిగ్రీ కళాశాల స్థాయి సెమినార్ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డిగ్రీ కళాశాల స్థాయి విద్యార్థులు వారిలోని నైపుణ్యాలను ప్రదర్శించడానికి రెండు రోజులుగా గ్రూపుల వారిగా ఏర్పాటు చేసిన సెమినార్ కార్యక్రమం ఎంతో అభినందనీయమని అన్నారు. విద్యార్థులు తమలోని సామర్థ్యాలను, స్ఫూర్తివంతంగా కొనసాగించేలా మెదడుకు పదును పెట్టాలని ఆయన పేర్కొన్నారు. ఈ పోటీలలో బోధన్ డిగ్రీ కళాశాల, ఉషోదయ డిగ్రీ కాలేజ్, ఉషోదయ మహిళా డిగ్రీ కాలేజ్, ఇందూరు ఉషోదయ డిగ్రీ కాలేజ్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలు ఆద్యాంతం రసవతరంగా కొనసాగాయి. అనంతరం విజేతలకు అతిథులు అభినందించారు. ఉషోదయ విద్యా సంస్థల చైర్మన్ సూర్య ప్రకాష్ విజేతలకు నగదు పారితోషికం అందించారు. కార్యక్రమంలో మొదటి రోజు ముఖ్య అతిథులుగా గిరిరాజ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ రంజిత, సైన్స్ అండ్ టెక్నాలజీ రుద్రూర్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పద్మావతి, హనుమండ్లు, ఉషోదయ కళాశాల చైర్మన్ సూర్య ప్రకాష్, ప్రిన్సిపాల్ గంగాధర్, శైలజ, స్రవంతి, అశ్విని తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేస్తున్న దృశ్యం

జేసీఎస్-1020 నువ్వులసాగుపై శిక్షణ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని మనోహరాబాద్ గ్రామంలో భారత వ్యవసాయ మండలి నూనె ఆధ్వర్యంలో సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారని మాజీ సర్పంచ్ రెడ్డి సోమవారం తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం రుద్రూర్ వారి ఆధ్వర్యంలో నువ్వుల పంటలో క్షేత్ర దినోత్సవం రైతు తిరుపతి రెడ్డి పొలంలో నిర్వహించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘం (జేఎంకేపీఎం) వారితో జేసీఎస్-1020 నువ్వుల రకం రైతులకు అందజేశారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డా.ఎం.సురేష్, శాస్త్రవేత్త-సేద్య విభాగం మాట్లాడుతూ.. భారత వ్యవసాయ పరిశోధనా మండలి నూనె గింజ పంటల ఉత్పత్తిని పెంచడంలో భాగంగా సిఎఫ్ఎల్‌డి ఆయిల్ సీడ్స్ కార్యక్రమంలో నువ్వుల పంటను ప్రోత్సహించామన్నారు. దీనిలో భాగంగా జేసిఎస్ -1020 అనే రకం లక్షణాలు, గుణగణాలను యాజమాన్య పద్ధతులను గురించి వివరించామని తెలిపారు. పి.విజయ్ కుమార్, శాస్త్రవేత్త-సస్యరక్షణ విభాగం మాట్లాడుతూ నువ్వుల పంటలో వచ్చే చీడపీడలు వాటి నివారణ చర్యల గురించి రైతులకు వివరించారు. జేయంకేపీఎం రైతు ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్- తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. తమ గ్రామంలోని రైతులకు విత్తనాలను అందజేయడం సంతోషంగా ఉందని అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ పంట లక్షణాలను, చీడపీడల ఉధతి గురించి తెలియజేశారు. కార్యక్రమంలో దేశీ రకం నువ్వులతో పోలిస్తే అధిక దిగుబడిని ఇస్తుందని అన్నారు. ఈ రకానికి ఎటువంటి చీడపీడలు గాని తెగుళ్ల గాని ఆశించలేదని రైతు సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డా.ఎం.సురేష్, శాస్త్రవేత్త-సేద్య విభాగం, రైతులు జి.శ్రీనివాస్, పి.నగేష్, ఏ సంతోష్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాస్త్రవేత్త

భారీగా పెరిగిన పోస్టాఫీస్ వడ్డీ రేట్లు

- సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ శ్రవణ్ కుమార్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఆర్థిక రంగంలో వడ్డీ రేట్ల పెరుగుదల పరిణామాలు చిన్న పొదుపు దారులకు మేలు చేకూర్చుతాయని ఇన్‌స్పెక్టర్ శ్రవణ్ కుమార్ అన్నారు. 2023 త్రైమాసికానికి సంబంధించి పొదుపు ఖాతాలపై వడ్డీ రేట్లు 0.1 శాతం నుంచి 0.7 శాతం వరకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వివరించారు. నేషనల్ సేవింగ్ సర్టిఫికేట్‌పై 7.0 నుంచి 7.7కి సుకన్య సమృద్ధి ఖాతాపై 7.6 నుంచి 8.0 శాతానికి, సీనియర్ సిటిజన్ స్కీంపై 8 నుంచి 8.5 శాతానికి, కిసాన్ వికాస్ పత్రంపై 7.2 నుంచి 7.5 శాతానికి, రికరింగ్ డిపాజిట్ 5.8 శాతం నుంచి 6.2 శాతానికి, ఒక సంవత్సరం ఫిక్స్ డిపాజిట్‌పై 6.6నుంచి 6.8 శాతానికి, ఐదు సంవత్సరాల ఫిక్స్‌డ్ డిపాజిట్‌పై 7 నుంచి 7.5 శాతానికి, నెలవారి ఆదాయం డిపాజిట్‌పై 7.1 నుంచి 7.4 శాతానికి, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ 7.1 శాతానికి, సేవింగ్స్ ఖాతాలపై అన్ని బ్యాంకుల కంటే పోస్ట్ ఆఫీస్ 4 శాతానికి అందిస్తుందని తెలిపారు. ప్రజలు ఈ మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోస్టల్ డిపార్ట్‌మెంట్ ప్రత్యేక డ్రైవ్‌ల ద్వారా కొత్త ఖాతాలు ప్రారంభం, పాత ఖాతాలు పునరుద్ధరణ ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఏప్రిల్ 30 తేదీ వరకు అవకాశం కల్పించినట్టు ఆయన తెలిపారు.

మురికి కాలువల నిర్మాణ పనులు ప్రారంభం



నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని హంగర్గ గ్రామంలో గ్రామ పంచాయతీ నిధులతో సర్పంచ్ బాలమణి హన్మండ్లు సోమవారం ప్రారంభించినట్టు జేపీఎస్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్, పాలకవర్గం, జేపీఎస్, గ్రామస్తులు హన్మండ్లు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దఎడ్గిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని పెద్దఎడ్గి గ్రామంలో సర్పంచ్ అస్తుత్‌వార్ వినోద్ సీసీ రోడ్డు పనులు ప్రారంభించారని జీపీ సెక్రెటరీ నాగయ్య తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ వినోద్ మాట్లాడుతూ.. గ్రామంలో ఇటీవలే గ్రామానికి ఎన్ఆర్ఈజీఎస్‌లో రూ.20 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పూర్తిచేశామని, అదేవిధంగా సోమవారం జడ్పీటీసీ నిధులతో రూ.2లక్షల వ్యయంతో హనుమాన్ మందిరం వద్ద నూతనంగా పనులను ప్రారంభించినట్టు వివరించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ దాదారావ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్ ఖండేరావ్, మాజీ విండో వైస్ చైర్మెన్ విజయ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్లల్లో పులిహోర, అంబలి కేంద్రం ప్రారంభం

- నిజామాబాద్‌లో ప్రజావాణికి 78 ఫిర్యాదులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/కామారెడ్డిటౌన్

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 78 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్డీఓ చందర్, నిజామాబాదు ఆర్డీఓ రవి లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో పులిహోర వితరణ

ఆయా సమస్యలపై అర్జీలు సమర్పించేందుకు ప్రజావాణి కార్యక్రమానికి తరలివచ్చే వారి కోసం సీనియర్ సిటిజన్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో పులిహోర వితరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సోమవారం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు చేతుల మీదుగా పులిహోర పంపిణీ ప్రారంభించారు. ప్రతి సోమవారం దీనిని కొనసాగిస్తామని సీనియర్ సిటిజన్స్ ఫోరమ్ అధ్యక్షుడు భూమన్న తెలిపారు. కాగా మార్వాడీ యువమంచ్ ఆధ్వర్యంలో చల్లటి తాగునీటిని సమకూర్చారు. వారిని కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ ఫోరం ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, కోశాధికారి అరుణ్ బాబు, విజయ్ కుమార్, ఏ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కంఠేశ్వర్: పులిహోర పంపిణీ చేస్తున్న కలెక్టర్



కామారెడ్డి టౌన్: అంబలికేంద్రం ప్రారంభిస్తున్న కలెక్టర్

కలెక్టరేట్‌లో అంబలి కేంద్రాన్ని ప్రారంభం

కామారెడ్డి టౌన్:కామారెడ్డి కలెక్టరేట్లో ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో అంబలి కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు.. వేసవికాలంలో ఉద్యోగుల దాహార్తిని తీర్చడానికి అంబలి కేంద్రం దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ దోత్రే, టీఎన్జీవోఎస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకటరెడ్డి, బి.సాయిలు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు రాజారామ్, చక్రధర్, శ్రీనివాస్ రెడ్డి, సాయి రెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల్లో 'బలగం' సినిమాను ప్రదర్శించొద్దు

నవతెలంగాణ-సదాశివనగర్

గ్రామాల్లో బలగం సినిమాను ప్రదర్శించవద్దని సదాశివనగర్ ఎస్ఐ బండి రాజేష్ అన్నారు. సోమవారం సినిమాను వివిధ గ్రామాలలో ప్రొజెక్టర్ల ద్వారా ప్రదర్శిస్తున్నట్టు సమాచారం ఉందని, ఈ విధంగా చేసిన వారికి ప్రోత్సహించిన వారికి చట్టరీత్యా శాఖపరమైన చర్యలు తీసుకుంటామని, అన్ని గ్రామాల్లో సర్పంచులు చాటింపు వేయించి సహకరించాలని కోరారు.

తాగునీటి సమస్య రానీయొద్దు

నవతెలంగాణ-రెంజల్

వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. సోమవారం మండలంలోని నీలా గ్రామపంచాయతీలో సర్పంచ్ లలిత రాఘవేందర్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలోని డ్రైన్స్ నిర్మాణంపై ప్రతిపాదనలు పంపారు. పారిశుద్ధ్య కార్మికుల పనితీరుపై పాలకవర్గ సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేయగా.. సర్పంచ్ స్పందిస్తూ పాలకవర్గ సభ్యులందరూ పారిశుధ్య కార్మికులు దృష్టిని సారించాలని కోరారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా వాటర్ మెన్ మోటార్లను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని సూచించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాభివృద్ధికి సంబంధించిన నిధులను సకాలంలో చెల్లిస్తే గ్రామాభివృద్ధికి సహకరించినట్టు అవుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే మహమ్మద్ షకీల్ ఆమీర్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నిధుల మంజూరుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు కురుమే శ్రీను, గైని సాయిలు, లావుల్ల ప్రమీల, ఈ.నాయత్ బి, సంగం ఈశ్వరి, కార్యదర్శి బి.రాణి, కారోబార్ రమేష్, సిబ్బంది సాయిలు, అర్బాజ్ తదితరులు పాల్గొన్నారు.

7 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ ఇన్చార్జి పోలీస్ కమిషనర్ నిర్మల్ ఎస్పీ ప్రవీణ్ ఆదేశాల మేరకు ఆదివారం నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 7 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదైనట్లు ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్ తెలిపారు. పట్టుబడినవారితోపాటు 13 మందికి సోమవారం నగరంలోని జిల్లా టిటిఐ కౌన్సిలింగ్ సెంటర్లో కౌన్సెలింగ్ నిర్వహించారు.

రేషన్ షాపుల్లో 12 రకాల నిత్యావసర సరుకులు ఇవ్వాలి

- ప్రగతిశీల మహిళా సంఘం

నవతెలంగాణ-ఆర్మూర్

రేషన్ షాపుల్లో 12 రకాల నిత్యావసర సరుకులను, 10కిలోల సన్న బియ్యాన్ని కుటుంబంలో ఒక్కరి చొప్పున ఇవ్వాలని ప్రగతి శీల యువజన సంఘం, ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు అన్నారు. సీపీఐఎంఎల్ ప్రజాపంథ పార్టీ కార్యాలయంలో సోమవారం గోడ పత్రుల ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ప్రగతిశీలి యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు బి కిషన్, ప్రగతిశీల మహిళా సంఘం ఏరియా అధ్యక్షురాలు పద్మ మాట్లాడుతూ రాయితీలు కార్పొరేట్లకు కాకుండా పేదలకు ఇవ్వాలని అన్నారు. రేషన్ షాపుల ద్వారా పన్నెండు రకాల నిత్యావసర సరుకుల పంపిణీ చేయాలని పి.వై.ఎల్, పి.ఓ.డబ్ల్యు ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం తలపెట్టినట్టు తెలిపారు. రేషన్ షాపుల్లో బియ్యం మాత్రం ఇస్తున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పది కేజీలు సన్న బియ్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మంచినూనె, కందిపప్పు, చింతపండు, పల్లీలు, ఉప్పు, కారం, పసుపు, గోధుమలు, పంచదార, టీ పొడి లాంటి సరుకులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. గ్యాస్ ధరలు విపరీతంగా మోడీ ప్రభుత్వం పెంచిందని, సబ్సిడీలో 95శాతం కోత విధించిందని అన్నారు. ఏప్రిల్ 1 నుండి 15 వరకు గ్రామాల్లో, బస్తీల్లో ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నామని వారు తెలిపారు. కార్యక్రమంలో ప్రగతిశీల యువజన సంఘం జిల్లా నాయకులు మనోజ్, అఫ్జల్. శేఖర్, శ్రీనివాస్, గంగాధర్, ప్రగతిశీల మహిళా సంఘం ఏరియా ప్రధాన కార్యదర్శి లక్ష్మీ, స్వరూప, అంజమ్మ, రజిత, గంగమ్మ స్రవంతి, సుల్తాన పాల్గొన్నారు.

బాజిరెడ్డి జగన్‌కు సన్మానం



జగన్‌ను సన్మానిస్తున్న నాయకులు

నవతెలంగాణ-మోపాల్

నిజామాబాద్ జిల్లా మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైనందున మండలంలోని టీఆర్ఎస్ నాయకులు సోమవారం బాజిరెడ్డి జగన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్చం ఇచ్చి సన్మానం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జగన్ ఉన్నత పదవులు పొందాలని రాజకీయంలో పైకిరావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నరేష్, కన్నీరాం, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు శ్రీనివాసరావు, విండో చైర్మన్ మోహన్ రెడ్డి, ఉమాపతి, కెంపు భూమయ్య ఇందూరు సిద్ధార్థ, ముత్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు. జరిగింది.

హనుమాన్ దీక్షాపరుల రాస్తారోకో

నవతెలంగాణ -నవీపేట్

సొసైటీ చైర్మన్ న్యాలకంటి అబ్బన్న వ్యాఖ్యలకు వ్యతిరేకంగా హనుమాన్ దీక్ష స్వాములు సోమవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా గురుస్వామి నాగేష్ మాట్లాడుతూ ఎల్కే ఫారం గ్రామంలో శుక్రవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సొసైటీ చైర్మన్ అబ్బన్న అభ్యంతరకరంగా మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండించారు. అంతేకాకుండా దీక్షలో ఉన్న వారిని అసభ్య పదజాలంతో దూషించడంతో ఆగ్రహించిన స్వాములు గంటపాటు రాస్తారోకో నిర్వహించారు. ఎస్ఐ రాజారెడ్డి సముదాయించే ప్రయత్నం చేసిన చైర్మన్ అబ్బన్న బహిరంగంగా క్షమాపణ చెప్పాలని పట్టు పట్టడం, ఎస్సై రాజారెడ్డి సైతం స్వాములపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. ఆయనపై 24 గంటల్లో చర్యలు తీసుకోవాలని అనడంతో ఎస్సై అంగీకరించగా స్వాములు శాంతించారు. అనంతరం స్వాములు పోలీస్ స్టేషన్‌కు నినాదాలతో ర్యాలీగా వెళ్లి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో గురు స్వాములు నగేష్, నాగరాజు, లక్ష్మీపతి, మహేష్, విశ్వహిందూ పరిషత్ నాయకులు తమ్మల కష్ణ, హిందుత్వ వాదులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై మాట తప్పింది

- బీజేపీ కార్యాలయం వరకు ఎమ్మార్పీఎస్ ర్యాలీ



బీజేపీ జిల్లా అధ్యక్షునికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చి మాట తప్పిందని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జి గంధమాల నాగభూషణం మండిపడ్డారు. సోమవారం నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని పులాంగ్ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలదండ వేసి బీజేపీ జిల్లా కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బసవ లక్ష్మీ నర్సయ్యకు వినతి పత్రం అందజేశారు. 2014లో అధికారంలోకి వస్తే 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం(బీజేపీ) తొమ్మిదేళ్ళ గడుస్తోందని ఉమ్మడి జిల్లా ఇంచార్జీ గంధమాల నాగభూషణం మాదిగ, ఎంఎస్‌పి జిల్లా కోఆర్డినేటర్ డల్లా సురేష్ మహాజన్ ఆవేదన వ్యక్తం చేశారు. మాదిగల ఆవేదన ఆవేశంగా మారకముందే బీజేపీ ఇచ్చిన మాట నిలుపుకోవాలని తెలిపారు. లేదంటే మాదిగల నుండి తిరుగుబాటు తప్పదని, రాజకీయంగా ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సుమన్, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ముప్కాల్‌లో కంటి వెలుగు ప్రారంభం



కంటిపరీక్ష చేస్తున్న వైద్యులు

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్ తో కలిసి ఎంపీపీ సామ పద్మ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మెడికల్ ఆఫీసర్ శిరీష రోగులకు వైద్య సేవలను అందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సామ పద్మ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంటి వెలుగు కార్యక్రమంను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కంటి సమస్యలున్న వారికి మందులు, కళ్లద్దాలను ఉచితంగా అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమం 10 వరకు కొనసాగుతుందని అన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బద్దం నర్సవ్వ, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సామ వెంకట్ రెడ్డి, బద్దం నర్సారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు పద్మ, మండల కో అప్షన్ సభ్యులు మునిరోద్దీన్, పంచాయతీ సెక్రటరీ విజయ్ కుమార్, మెడికల్ ఆఫీసర్ శిరీష, హెల్త్ సూపర్ వైజర్లు నిరీక్షణ, సుమతి, సురేష్, ఆరోగ్య శాఖ సిబ్బంది పద్మ, ఆశ వర్కర్లు, అంగన్ వాడి టీచర్లు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామానికి ప్రథమ బహుమతి రావడం సంతోషకరం

- అందరి సహకారంతోనే అవార్డు
- సర్పంచ్ కౌడి రాధ రవి

నవతెలంగాణ-తాడ్వాయి

'స్వయం మౌలిక వసతుల కల్పన పేదరిక నిర్మూలన' విభాగంలో ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా కంకల్ గ్రామానికి ప్రథమ బహుమతి రావడం సంతోషకరమని సర్పంచ్ కౌడిరాధ తెలిపారు. సోమవారం గ్రామపంచాయతీ పారిశుధ్య సిబ్బంది చేసిన సేవలకు గానూ ఘనంగా సన్మానించారు. అలాగే గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం చివరి రోజు ఉండడంతో గ్రామానికి 10 రోజులు సేవ చేసినందుకు వైద్య సిబ్బందికి, ఆశాలకు, అంగన్వాడీ టీచర్లకు, ఐకేపీ వీవోఏ, వీఆర్ఏలకు సర్పంచ్ కౌడిరాధ ఆధ్వర్యంలో సన్మానించారు. ఉప సర్పంచ్ సాయిరెడ్డి మాట్లాడుతూ.. తమ గ్రామానికి కంటి వెలుగు సేవలు అందించినందుకు గ్రామం తరపున మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి బాపురావు, వార్డ్‌మెంబర్స్ భూపతిరెడ్డి, సంతోష్‌రెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.



పారిశుద్ధ్య సిబ్బందిని సన్మానిస్తున్న సర్పంచ్

ఇంటి పన్ను చెల్లించి రాయితీ పొందాలి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు 2023-2024 ఇంటి పన్ను చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ జీవన్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఇంటి పన్ను ఈ నెల 30లోపు మొత్తం చెల్లించి 5శాతం డిస్కౌంట్ పొందాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ అవకాశాన్ని ఎల్లారెడ్డి మున్సిపల్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉపాధిహామీ పనులు పరిశీలన

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని గుండూర్ గ్రామంలో సర్పంచ్ దేవిదాస్, ఉప సర్పంచ్ ఉమాటే ప్రకాశ్ ఉపాధిహామీ పనులను సోమవారం పరిశీలించినట్టు జేపీఎస్ రాజు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ దేవిదాస్ మాట్లాడుతూ.. పనులను కొలతల చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్, ఉపసర్పంచ్, జేపీఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సభ్యత్వ కార్డులు పంపిణీ

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాగిరెడ్డిపేట్, ఎల్లారెడ్డి మండలాలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలకు ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇంచార్జ్ వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ సభ్యత్వ కార్డులను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏ కార్యకర్తకు ఆపద వచ్చినా.. కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, ప్రమాదవశాత్తు కార్యకర్త చనిపోతే సభ్యత్వం ఉంటే రెండు లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రతి ఒక్క కార్యకర్తను కంటికి రెప్పలా కాపుడుకుం టుందని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నర్సింహులు, జనార్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆఫీజ్, పేషెట్టి రవి కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

విలేకరిపై దాడి అమానుషం

నవతెలంగాణ-తాడ్వాయి

నవతెలంగాణ విలేకరిపై దాడి చేయడం అమానుషమని తాడ్వాయి ప్రెస్‌క్లబ్ మండలాధ్యక్షులు సాయిబాబా అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల మండల విలేకరి ఎట్టెం అనిల్‌పై గుమ్మిర్యాల్ గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఆదివారం దాడికి పాల్పడ్డారని, నిజాన్ని నిర్భయంగా రాసే నవతెలంగాణ విలేఖరిపై దాడి చేయటం అమానుషమని అన్నారు. నవతెలంగాణ పత్రిక ఎప్పుడూ ప్రజల పక్షాన పోరాడుతుందని అలాంటి పత్రికలో పని చేసే విలేఖరిపై దాడి చేసినవారిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. సమావేశంలో రాజ్కుమార్, నరేష్, ప్రవీణ్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మహిళలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు

నవతెలంగాణ-ఆర్మూర్

అర్మూర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య మహిళ ద్వారా మహిళలకు ప్రత్యేక ఆరోగ్య పరీక్షలలు మంగళవారం నిర్వహిస్తున్నట్టు డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 సంవత్సరాల పైబడిన మహిళలకు అనేక ఆరోగ్య సమస్యలు ఉంటాయని, స్త్రీ వైద్య నిపుణులతో ఆరోగ్య పరీక్షలు నిర్వహించచి ఉచితంగా మందులు అందజేస్తారని పేర్కొన్నారు. అవసరమైన వారికి జిల్లా ఆసుపత్రికి పంపుతామని తెలిపారు.

వెల్లుట్లలో పోషకాహార మహోత్సవాలు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

మండలంలోని వెల్లుట్ల, వెల్లుట్లపేట్, వెంకటాపూర్ గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రంలో పోషకాహార మహోత్సవాలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు పలు సూచనలు చేశారు. అదేవిధంగా పిల్లలకు చిరుధాన్యాలపై గుడ్లు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. అనంతరం పలువురు మహిళలకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ ఎన్.బాషవ్వ, యూసఫ్ జానీ, సుజాత, ప్రమీల, షానుభాయి, ఏఎన్ఎం ఇందిరా తదితరులు పాల్గొన్నారు.